# ఫూల్

"వాడే లతకు ఎదురైవచ్చు వాడని వసంత మాసం వనివాడని కుసుమ విలాసం" సుశీల గొంతులోంచి జాలువారుతున్న దేవులపల్లి గీతం-టూ-ఇన్-వన్‌లోంచి అతిశ్రావ్యంగా వినబడుతూ-వాతావరణాన్ని ఆహ్లాదభరితం చేస్తోంది. నేను, గౌతమి తన్మయత్వంతో తలలూపసాగేము.

పాట పూర్తయిన తరువాత టేప్ ఆఫ్ చేసింది గౌతమి.

"ఇప్పుడు చెప్పవే ఎలా ఉన్నావు? లతెలా ఉంది?" అడిగింది గౌతమి.

నేను, గౌతమి, లత-ముగ్గురం కాలేజ్‌మేట్స్‌మి. ఈమధ్యనే ఎమ్‌సెట్ రాసి, ఇంజనీరింగ్‌లో ముగ్గురం ఒకేసారి జాయినయ్యాం! ముగ్గురిదీ ఒకే బ్రాంచ్ ఇంజనీరింగ్‌లో.

మేము కాలేజ్‌లో జాయినై మూడు నెలలైంది. గౌతమి ఓ పదిహేనురోజులు వాళ్ళ తాతగారి ఊరు వెళ్ళి ఈరోజే తిరిగి వచ్చింది.

తను వచ్చిందని తెలిసి, వెంటనే నేను వాళ్ళ యింటికి వచ్చాను.

రెండు రోజుల క్రితమే లత, వాళ్ళ అమ్మమ్మగారికి ఆరోగ్యం బాగుండలేదని తెలిసి వాళ్ళ వూరికి వెళ్ళింది.

"లతెలా ఉందే?" అని అడిగింది గౌతమి

"తను రెండు రోజుల క్రితమే వాళ్ళ అమ్మమ్మ గారి ఊరెళ్ళింది!" ఎందుకు వెళ్ళిందో కూడా వివరించి చెప్పేను.

"అలాగా! బాగుందాతను" అడిగింది గౌతమి

"ఆ విషయమే యిప్పుడు చెబుదామనుకుంటున్నాను. ఈలోగా నువ్వే అడిగేశావు"

"ఏమయిందే?"

"తనకేం కాలేదులే! కంగారు పడకు పాపం మన కాలేజ్ కుర్రాడే ఒకడు దాన్ని ఏడిపించుకు తినేస్తున్నాడే"

"ఎవడేవాడు! ఏం జరిగింది?"

"చెబుతాను విను" అంటూ చెప్పసాగేను.

మాతో గౌతమి లేకపోవడం లోటుగానే ఉండేది. ఆరోజు ఏదో రిఫరెన్స్ కోసం కాలేజ్ లైబ్రరీ వైపు వెళుతున్నాం యిద్దరం. ఎదురుగా ఎవరో నలుగురైదుగురు సీనియర్స్ వస్తున్నారు.

హఠాత్తుగా ఓ కుర్రాడు లతకు 'డాష్' యిచ్చేడు. లత చేతిలోని పుస్తకాలన్నీ క్రింద పడిపోయాయి. వాడు కావాలనే లతకు 'డాష్' యిచ్చినట్లు గమనించేను నేను.

"అయ్యయ్యో! సారీ అండీ" అంటూ నొచ్చుకుంటున్నట్లు నటిస్తూ, వాడు క్రిందపడిన పుస్తకాలు ఏరి లత చేతికిస్తూ, ఆమె చేతిని నొక్కి వదిలేడు.

"ఇడియట్" తిట్టింది లత.

వాడు పట్టించుకోకుండా ఓ నవ్వు నవ్వి వెళ్ళిపోయాడు.

"వాడు కావాలనే నీకు 'డాష్' యిచ్చేడు తెలుసా" అన్నాను.

"అందుకే కదా తిట్టేను" అంది చిరుకోపంతో లత.

మరోసారి-

కేంటీన్ మెట్లెక్కుతున్నాం యిద్దరం! అప్పుడే కేంటీన్ లోంచి బయటికి వస్తున్నాడు అదే స్టూడెంట్! మమ్మల్ని చూస్తూనే వేగంగా మాకు ఎదురొచ్చి అతని 'ఢీ' కొట్టేడు.

'ఢీ' కొడుతూనే అతి లాఘవంగా లత నడుమ్మీద చెయ్యి వేసి నొక్కి వదిలేడు. ఆ రాస్కెల్ మీద నాకే పీకల



వరకూ కోపం వచ్చిందంటే, లతకింకెంత కోపం వచ్చి ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.

"రాస్కెల్" తిట్టింది లత నడుం మీద రాసుకుంటూ.

వాడు నవ్వుకుంటూ వెళ్ళిపోయాడు.

"వాడు కావాలనే నీకు డాష్ యిస్తున్నాడే! ప్రిన్సిపాల్‌కి కంప్లయింట్ చేద్దాం" అన్నాను.

"పోనీలే ఊరుకో. రిపోర్ట్ చేస్తే అందరికీ తెలిసిపోతుంది. అంతా మనల్నే చులకనగా చూస్తారు" అంటూ నన్ను ఊరుకోబెట్టింది.

ఆరోజు లత పుట్టిన రోజు! కాలేజ్‌కి రాగానే ఫైవ్‌స్టార్ చాక్లెట్ బార్ యిస్తూ చెప్పిందా విషయం లత.

గులాబీరంగు చుడీదార్‌లో ఎర్రగులాబీలా అందంగా మెరిసిపోతోంది లత.

చాక్లెట్స్ తింటూ మేమిద్దరం అలా గులాబీ తోటలో విహరిస్తున్నాము కబుర్లాడుకుంటూ.

ఎక్కడ నుండి ఎలా వచ్చాడో ఏమో ఆ రాస్కెల్, హఠాత్తుగా ఎదురుగా వున్న తెల్లగులాబీ పొదల మధ్యలోంచి దూసుకు వచ్చాడు.

మేము ఎలర్ట్ అయ్యేలోగానే లతను బలంగా 'డాష్' కొట్టేడు.

ఆ వూపుకి అది నేల మీద పడిపోవాల్సిందే! వాడు ఒడుపుగా లతను పడిపోకుండా దాని నడుం చుట్టూ చేతులు వేసి బలంగా కౌగిలించుకుంటూ ఆమె లేత పెదవుల మీద తన అధరాలనుంచి గాఢంగా చుంబించాడు. మరుక్షణం దాన్ని వదిలి మాయమయ్యాడు.

అది స్టన్ అయిపోయి పెదవులు తుడుచుకోవడం కూడా మరచిపోయింది.

ఇలా ఎన్నోసార్లు వాడు ఎదురైన ప్రతీసారీ లత వాణ్ణి తిట్టుకుంటోంది తప్ప వాడి మీద ప్రిన్సిపాల్‌కి కంప్లయింట్ చెయ్యడం లేదు.

"విచిత్రంగా ఉందే! ఎవడే అంత డేర్ డెవిల్ రాస్కెల్! రేపు కాలేజ్‌కి వస్తాను కదా చూపించు వాణ్ణి. తేలుస్తాను వాడి సంగతి" అంది గౌతమి కోపంగా.

ఆ మరునాడు కాలేజ్‌లో- లంచ్ అవర్‌లో నేను, గౌతమి కేంటీన్ వైపు వెళుతున్నాము. వాడు అప్పుడే కేంటీన్‌లోంచి బయటకు వస్తున్నాడు.

నాకు అరికాలి మంట నెత్తికెక్కుతోంది వాణ్ణి చూస్తుంటే!

ఈ రోజు లత లేదు మాతో. నావైపు తిరిగి వాళ్ళ తాతగారింటి విషయాలేవో చెబుతోంది గౌతమి.

"ఏయ్ గౌతూ! నేను చెప్పేను చూడూ ఆ రాస్కెల్ గురించి..వాడే..వాడే లతకు ఎదురై.." నేనింకా చెబుతుండగానే గౌతమి-వాడివైపు చూసి-ముందు విస్మయపడి ఆ తరువాత నవ్వడం మొదలుపెట్టింది.

నాకు ఒళ్ళు మండిపోతోంది దాని నవ్వు చూసి.

"నవ్వుతావేమిటే? వాడు దాన్ని అంతగా ఏడిపించుకు తింటే నీకు నవ్వులాటగా ఉందా?" సీరియస్‌గా అన్నాను.

దాన్నలా రెండు, మూడు నిమిషాలు నవ్వనిచ్చాను.

"అయ్యిందా!" అనడిగేను యింకా కోపంగా.

"అయ్యో! పిచ్చిదానా! వాళ్ళిద్దరూ కలిసి నిన్ను ఫూల్‌ని చేశారే" అంది.

"నన్ను వాళ్ళిద్దరూ కలిసి ఫూల్‌ని చెయ్యడమేమిటే?"

"వాడు..వాడు లత బావ వినయ్! వాళ్ళ అత్తయ్య కొడుకు. ఇద్దరూ కాబోయే భార్యాభర్తలే తల్లీ! వాడు నాకు తెలుసు. కానీ నీకు తెలియకపోవడంతో వాళ్ళిద్దరూ కలిసి నిన్ను ఆట పట్టించారు. ఆ రోజు రోజ్‌గార్డెన్‌లో వాడు యిచ్చిన ముద్దు లతకు పుట్టినరోజు బహుమతి" చెప్పింది గౌతమి.

**-కోనే నాగ వెంకట అంజనేయులు**

(విశాఖపట్టణం)